

# రాకడ? పోకడ?

ఒక మౌల్వీగారు మహా అహంకారి. చదువు గిదువూ వచ్చేసిందని బలే పొగరు. చదువు రానోళ్లని అసలకి లెక్కచేసేవాడు కాదు. ఒకసారి ఆయన పుస్తకాల్నీ గిస్తకాల్నీ ఒంటె మీద వేసుకొని యింటికి బయలుదేరారు. దారిలో ఒక ఊరు తగిలింది. ఒకామె కోడిని చేతబట్టుకొని వెళుతూ కనిపించింది.

మౌల్వీగారు ఆమెను ఆపి 'ఏమమ్మా. ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగారు.

'సాహెబ్. మా ఊర్లో ఒక సాయెబు ఉన్నాడు. వాడి పేరు బిస్మిల్లా సాయెబు. వాడికి చదువూ గిదువూ లేకపోయినా బిస్మిల్లా చేయడం తెలుసు. వాడికి ఆ డబ్బులే ఆధారం. అందుకని నా కోడిని కోయించుకుందామని వాడి దగ్గరకు వెళుతున్నాను' అంది.

'అమ్మా... ఈ మాత్రం దానికి ఆ తెలిసీ తెలియని సాయెబు దగ్గరకు వెళ్లడం ఎందుకు? వాడికి ఏం తెలుసని? ఈసారికి నేను బిస్మిల్లా చేసిస్తాలే' అని, బిస్మిల్లా చేసి తిరిగి బయలుదేరారు మౌల్వీగారు.

ఈ సంగతి బిస్మిల్లా సాయెబుకి ఎలాగో తెలిసింది. వెంటనే అతడు అడ్డదారిలో గబగబా పరిగెత్తుకుంటూ వచ్చి మౌల్వీగారు వెళుతున్న దండుబాట మీద చేతికర్రతో అడ్డంగా ఒక గీత గీశాడు.

ఆ రోజుల్లో ఎవరి దారికైనా ఎవరైనా అడ్డంగా ఒక గీత గీస్తే యింక అక్కడ సవాల్ జవాబ్ (ప్రశ్న జవాబు) ఉందని అర్థం. ఆ గీతను చూసి ఒంటె ఆగిపోయింది. ఒంటె మీదున్న మౌల్వీగారు బిస్మిల్లా సాయెబుని ఏమిటి సంగతి అన్నట్టు చూశారు.

'నీ దోవన నువ్వు పోకుండా నా పనిలో జోక్యం చేసుకున్నావు కాబట్టి నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పి కదులు' అన్నాడు బిస్మిల్లా సాయెబు.

'ఏమిటా ప్రశ్న?' అన్నాడు మౌల్వీ.

'ఎక్కడ నుంచి రాకడ? ఎక్కడికి పోకడ? ఎక్కడ నీ శాశ్వత నిలకడ?' అని అడిగాడు బిస్మిల్లా సాయెబు.

ఈ ప్రశ్నకు మౌల్వీగారికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు. తెల్లమొఖం వేశాడు.

'చెప్పవయ్యా పెద్దమనిషి. పెద్ద పెద్ద చదువులు చదివానని విర్రవీగడం కాదు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పు' అన్నాడు బిస్మిల్లా సాయెబు.

మౌల్వీగారు ఓటమి అంగీకరించి ప్రశ్నకు సమాధానం చెప్పమని వేడుకున్నారు.

అప్పుడు బిస్మిల్లా సాయెబు ఆ ప్రశ్నకు సమాధానంగా-

'మక్కా నుంచి రాకడ మదీనాకు పోకడ ఖబరస్తాన్ నీ శాశ్వత నిలకడ' అని చెప్పాడు.

మౌల్వీ బిక్కమొకం వేసేసరికి అప్పుడు ఇలా వివరించాడు:

'ఓ మౌల్వీగారూ. అల్లాకు ఎంతో ప్రియమైనవాడు, మహా పురుషుడు మన ప్రవక్త, అట్లాంటి ప్రవక్తే తను పుట్టిన మక్కాను కొన్ని కారణాల వల్ల వదిలిపెట్టక తప్పలేదు. మదీనాకు వెళ్లిపోకా తప్పలేదు. అదే మదీనాలో పరమపదించి అంతిమంగా ఖబర్‌లోకి చేరకా తప్పలేదు. అంతటి పుణ్యపురుషునికే జనన మరణాలు తప్పనప్పుడు నువ్వెంత? నేనెంత? నాలుగు పుస్తకాలు చదవగానే నాలుగు డబ్బులు సంపాదించగానే అంతా మనమే అని మిడిసిపడతాము. ఈ మిద్దెలూ ఈ మేడలూ శాశ్వతమనుకుంటాము. చివరకు యివన్నీ పోయి అందరం సమానమై చేరేది ఖబరస్తాన్‌కే గదా. అక్కడే కదా మనం శాశ్వతంగా పడి ఉండేది' అని విడమర్చాడు.

మౌల్వీగారు ఆ సమాధానానికి సిగ్గుపడి అప్పటి నుంచి ఎవరి కంటే కూడా ఎక్కువ అని అనుకోలేదు.